www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -82 సోమవారం 6 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 4 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

● తెలంగాణకు ఫేజ్-1 ● అప్పగింతలో వేగం పెంచాలి ● ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే అమోదం తెలపాలి ● ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించండి ● ఆలస్యమయ్యేకొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ● కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరు లేఖలు



**హైదరాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):**హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1ను తెలంగాణకు బదిలీ చేసే విషయంలో వేగం పెంచాలనీ, ఫేజ్-2 నిర్మాణానికి తక్ష?ణమే ఆమోదం తెలపాలని ఆయన విన్నవించారు. ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే కొద్దీ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ఉందని మిగతా2లో...

# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు



**హైదరాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):**మీడియాతో చిట్‌చాట్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను తిట్టించడానికి వైసీపీ పార్టీ సోషల్ మీడియా బ్యాచ్‌కి భారీగా ఫండింగ్ ఇస్తోందని అన్నారు. డబ్బులు ఎరచూపి తమపై దుష్ప్రచారం చేయిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా2లో...

## వచ్చే మూడు రోజులు వర్షాలు..

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం



**హైదరాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):**బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని, ఇది ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతానికి సమీపంలో కేంద్రీకృతమై మిగతా2లో...



## మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):** సల్కం చెరువు బఫర్ జోన్ లో బారిస్టర్ ఫాతిమా ఒవైసీ విద్యా సంస్థలు ఉన్నట్లు తీవ్ర ఆ రోపణలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. మజ్లిస్ అంటే భయమా? ప్రేమా? లేక రెండూ ఉన్నా యా? అని ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్ర భుత్వాన్ని ప్రశ్నించారు. మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే మిగతా2లో...

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

## - వారం రోజులు అప్పగిస్తే రాష్ట్రమంతా నీళ్లు పారిస్తాం

● మేడిగడ్డతో అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యం ● ప్రభుత్వం స్పందించకుంటే 50వేల మందితో పంప్‌హౌస్ ముట్టడి : బీఆర్ఎస్ వర్కింగ్ ● ప్రెసిడెంట్ కేటీఆర్ పంప్‌హౌస్ పరిశీలన



**మహదేవపూర్/అదిలాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):**కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను నడపడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల బృందం జయశంకర్ ?భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది.. ఈ సందర్భంగా ?ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం 98వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని తెలిపారు. ఎంతటి కరువులోనైనా నీటి నిల్వ ఉండే అద్భుతమైన ప్రాంతం కన్నెపలి అని, మేడిగడ్డ మిగతా2లో...



## దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

**సియోల్,జూలై 5 (ప్రజావినికిడి):** సౌత్ కొరియాలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. సియోల్‌లో ఇవాళ (ఆదివారం) మంత్రి లోకేశ్‌తో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కే, ఏఎస్ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్‌ల ఆధారంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0 కోసం చర్యలు చేపట్టాలని మిగతా2లో...

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

ప్రమాదమని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది

పొరపాట్లను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

2027 లోగా కాళేశ్వరం మరమ్మతులు పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, (ప్రజావినికిడి):.జూలై 05:** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఈ ఏడాది నీరు నింపడం సాధ్యం కాదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'మూడు బ్యారేజీల ఫౌండేషన్‌లో లోపాలున్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుంది. భద్రాచలంతో పాటు దాదాపు 40 గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. ప్రాజెక్ట్ నాణ్యతతో నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. బ్యారేజీల గేట్లు దింపే మిగతా2లో...



## మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, (ప్రజావినికిడి):జూలై 05:** మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బిఆర్ఎస్ నాయకులు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేయడం లేదని, ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ఏకైక లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం లేదని, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ స్పష్టమైన సూచనలు ఇచ్చిన తర్వాత కూడా మిగతా2లో...

## ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ● ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబాటు ● 361 మంది లబ్ధిదారులకు 2 బీహెచ్‌కే పట్టాల పంపిణీ : మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్




**హైదరాబాద్,జూలై 5 (ప్రజావినికిడి):**ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలు ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం అవసరమైతే విలువైన ప్రభుత్వ భూములను కేటాయించడానికీ వెనుకాడబోమన్నారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా మిగతా2లో...

# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మనోహర్‌లాల్ ఖట్టర్, జి.కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో కిషన్‌రెడ్డి సమక్షంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 బదిలీ, ఫేజ్-2 విస్తరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిల్లో ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదని సీఎం ఎత్తిచూపారు. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించేందుకు అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు.ప్రస్తుతమున్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే రీఫైనాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలంటూ నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని వివరించారు. అందుకే అదే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాలు, నిధుల సమీకరణ మార్గాలు, ప్రాజెక్టు అమలుకు కావాల్సిన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను వెంటనే ఖరారు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించినట్టు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు కేంద్రం ఎస్‌బీఐ క్యాప్స్‌ను అధికారికంగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదని గుర్తుచేశారు.దీంతో మెట్రో ఫేజ్-1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందనీ, రోజువారీ నిర్వహణలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ క్యాప్స్ జాప్యం వల్ల మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల నిధుల సమీకరణ ముందుకు సాగట్లేదనీ, ప్రాజెక్టు ప్రారంభం మరింత ఆలస్యమవుతున్నదని తెలిపారు. ఇలా ఆలస్యమయ్యే కొద్దీ ధరల పెరుగుదల, వడ్డీ భారం, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం వంటి కారణాలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటనీ, పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్-1 బదిలీ పూర్తయి, ఫేజ్-2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా నగరాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సీఎం కోరారు.

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీతో అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి ఫ్లడ్ ఫ్లో ద్వారా మిడ్ మా నేరు, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని పేర్కొన్నారు. నీళ్లు ఇవ్వాలని రైతులు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, రసమయి బాలకి షన్ కోరినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కన్నెపల్లి పంపులు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయనే విషయం కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుస న్నారు. ఒకవేళ నీళ్లిస్తే రైతులకు యూరియా, మద్దతు ధర, బోనస్, 24 గంటల కరెంట్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ మోటా ర్లు ఆన్ చేయడం లేదని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందన్నారు. కేసీఆర్‌కు వారం రోజు లు కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగిస్తే రాష్ట్రమంతటా నీళ్లు పారిస్తామని సవాల్ విసిరారు. **హైదరాబాద్‌కు తాగునీటి సంక్షోభం** రాష్ట్రంలో 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తాము మూడు నెలల క్రితమే హెచ్చరించామని కేటీఆర్ గుర్తుచేశారు. ఉమ్మడి ఏడు జిల్లాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ కు తాగునీరు అందించే సామర్థ్యం కాళేశ్వరానికి ఉందన్నారు. కాంగ్రెస్ చేతకానితనం వల్ల ప్రాజెక్టును పడావు పెట్టడంతో హైదరాబాద్‌లో రోజుకు 15 వేల వాటర్ ట్యాంకర్లు తిరుగుతున్నాయని అన్నారు. త్వరలోనే తీవ్ర తాగునీటి సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రూ.94 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే .. అందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడంపై కేటీఆర్ మండిపడ్డారు. 'సీఎం రేవంత్‌రెడ్డికి సోయి ... మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్పృహ ఉందా..అని ప్రశ్నించారు. కాళేశ్వరం వల్లే రాష్ట్రం వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటి నెంబర్ వన్ స్థానాని కి చేరిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సుంకిశాల గోడ కూలినా, వట్టెం పంప్‌హౌస్ కొట్టుకుపోయినా, ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలి ఎనిమిదిమంది చనిపోయినా పట్టించుకోని ప్రభుత్వం, కాళేశ్వరంపై మాత్రం విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు. కక్షపూరిత రాజకీయాలు పక్కన పెట్టి కన్నెపల్లి మోటర్లు నడపాలని, లేనిపక్షంలో 50 వేల మంది రైతులతో కలిసి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పర్యటనలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. **కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన ఉద్రిక్తం** కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన సందర్భంగా జనగామ జిల్లా పెంబర్తి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంప్‌హౌస్ సందర్శనకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ కాన్వాయిను పెంబర్తి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, కేటీఆర్‌తో పాటు వస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతుల వాహనాలను పలుచోట్ల నిలిపివేశారు. పెంబర్తి వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కేటీఆర్ కాన్వాయి ముందుకు సాగలేకపోయింది. దీంతో కేటీఆర్ వాహనం దిగి పోలీసు అధికారులతో మాట్లాడారు. అంతలో అక్కడికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి లేదు. నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయడం సాధ్యం కాదు' అని ఉత్తమ్ ఈ సదర్భంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత కమీషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని విమర్శించారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయని భావించి చేసిన తప్పిదం ఉత్తర తెలంగాణకు శాపంగా మారిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు కూడా నీరివ్వలేక పోయారని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ సాగర్, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, డిండీ మొదలగు ప్రాజెక్టలన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని గుర్తు చేశారు.తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది కూడా ఆయన హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు ఆన్ చేసి నీరివ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టును సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ఇంజినీరింగ్ కోణంలో చూడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యంత కీలక అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్ 24న కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ పూర్తి స్థాయి నివేదిక ఇస్తూ పలు సిఫారసులు చేసిందని మంత్రి గుర్తు చేశారు. అది చేసిన సూచనల మేరకు గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు వంటి అత్యాధునిక పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ పనులను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), ఐఐటీ ముంబాయి, ఎన్‌డీఎస్ఏ, కేంద్ర జల సంఘం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. భద్రతపై పూర్తి స్థాయి నమ్మకం వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొని పంపింగ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అపోహలు సృష్టించే రాజకీయ ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ వద్ద కనిష్ట పాండ్ లెవెల్ లేకపోవడంతో కన్నెపల్లి పంపింగ్ అసాధ్యంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో డిజైన్లను ఖరారు చేసి, వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వివరించారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో కలిసి మంత్రి 361 మంది లబ్దిదారులకు 2 బీహెచ్‌కే గృహాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పేదలు వివిధ వృత్తుల ద్వారా ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ప్రభుత్వ భూములను వినియోగిస్తామని చెప్పారు. గత పదేండ్లుగా ఇండ్ల కోసం ఎదురుచూస్తూ పేదలు పడిన ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఆ ఆలస్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని, ఇకపై సంక్షేమ పథకాల అమలులో జాప్యానికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన ప్రతి కుటుంబానికి 48 గంటల్లోనే రేషన్ కార్డు జారీ చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో మరో రెండు లక్షల సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు.

వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద నిర్మించిన పాత భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త గృహాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొత్త ఇండ్ల కేటాయింపులో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ.. పేదలకు శాశ్వత నివాసం కల్పించడం సామాజిక న్యాయంలో భాగమని, ప్రభుత్వం నిరంతరం పేదల పక్షాన నిలుస్తుందన్నారు.ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. మొత్తం 361 మంది లబ్దిదారులకు గృహాల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

ఇందులో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన 187 మంది, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన 79 మంది, నాచారం కాలనీకి చెందిన 95 మంది లబ్దిదారులు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుమార్, వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్, గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల అధికారులులు, పాల్గొన్నారు.

# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. రాష్ట్రంలో సైబర్ దాడులు, అసభ్య పోస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# వచ్చే మూడు రోజులు వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వచ్చే 24 గంటల్లో ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. దీని ప్రభావంతో వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.వర్షాలు కురిసే సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నది. భారీ వర్షాలు కురుసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, రాబోయే మూడ్రోజులు గుజరాత్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లోని ప్రాంతాలకు విస్తరిస్తాయని వెల్లడించింది.

# మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన దుయ్యబట్టారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని ఆయన దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ సెలక్టివ్ గవర్నెన్స్ (పక్షపాత పాలన)కు హైడ్రా ఓ ఉదాహరణ అని తెలిపారు.సామాన్య ప్రజల విషయంలో మాత్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటూ మీనమేషాలు లెక్కిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో రావడం లేదని, హైడ్రా, విద్యా శా ఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా సామాన్య ప్ర జల విషయంలో చూపే తొందరపాటును ఫాతిమా కాలేజ్ వ్యవహారంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూపించడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మజ్లిస్ పార్టీని యా వత్ ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఇది పూర్తిగా తప్పు. హైడ్రా చర్యల వల్ల పేద ముస్లింల ఇళ్లు కూడా కూల్చివేయబడ్డాయని, వారి జీవనోపాధి దెబ్బతిన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వారి తరపున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆ యన తెలిపారు.కానీ ఒవైసీ సోదరుల ఆస్తుల విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదని, తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోందని స్పష్టంగా అర్థమవుతోందని ఆ యన పేర్కొన్నారు. ఫాతిమా విద్యా సంస్థల వ్యవహారం కాం గ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలను, మజ్లిస్ ద్వం ద్వ వైఖరిని బట్టబయలు చేసిందని ఈ రెండు పార్టీలకు తా ము ముస్లిం సమాజానికి ప్రతినిధులం అని చెప్పుకునే హ క్కులేదని ఈ విషయం తేటతెల్లం చేసిందని తెలిపారు.


# దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

గౌరంగలాల్ దాస్‌ని లోకేశ్ కోరారు. ఇందుకు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఏపీలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా-అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఏప్రిల్ 2026లో సౌత్ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ భారత్ పర్యటన సందర్భంగా 'కొరియా ఎన్‌క్లేవ్'కు సిద్ధంగా ఉన్నామన్నారు. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని ఈ సందర్భంగా గౌరంగలాల్ దాస్‌ను కోరారు. అనంతపురంలో కియా, హ్యుందాయ్ మోబిస్ ఆటో-ఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపైనా వారిద్దరూ చర్చించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డీ హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్, బ్యాటరీ/గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ సూచించారు. ఏపీ-సౌత్ కొరియా మధ్య సంబంధాల బలోపేతానికి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొరియా ప్లస్, ఖూ=ూ, భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక ఏపీ-కొరియా డెస్క్ ఏర్పాటు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. 10న నిర్వహించే సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో, +2+ అవగాహన ఒప్పందాల వైపు మళ్లించేలా చొరవ చూపాల్సిందిగా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌కి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయొద్దని, కన్నేపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరించారని గుర్తుచేశారు.అయినప్పటికీ కెటిఆర్, కెసిఆర్‌లు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంగా కాకుండా బిఆర్ఎస్ అవినీతికి ప్రతీకగా మారిందని ఆరోపించారు. లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరమైందన్నారు. మేడిగడ్డ కుంగిపోవడం, పంపులు మునిగిపోవడం, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతికి శాశ్వత సాక్ష్యాలన్నారు. ఇది నీళ్ల ఎత్తిపోతల పథకం కాదని, నిధుల ఎత్తిపోతల పథకమని తెలంగాణ ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. కెటిఆర్ ఒక మాట, కెసిఆర్ మరో మాట మాట్లాడుతున్నారని, నిజంగా తమ మాటలపై విశ్వాసం ఉంటే ఢిల్లీలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎదుట తమ వాదనను నిరూపించాలని సవాల్ విసిరారు. మీడియా కెమెరాల ముందు డ్రామాలు చేయడం కంటే నిపుణుల ముందు నిలబడి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ప్రకటిత ఇంజినీర్ల మాటలు వినదని, నిపుణుల సూచనల మేరకే ముందుకుసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 6 జులై 2026

# బండ్లగూడలో భారీ షెడ్ నిర్మాణం..

**అధికారుల అండతోనే యదేచ్ఛగా నిర్మాణాలు..**

**జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం..**

**అనుమతుల పై అనుమానాలు.? అధికారుల మౌనం..!**

**రాజకీయ పలుకుబడితో జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి..**

**టౌన్ ప్లానింగ్ మౌనంపై ప్రజల మండిపాటు..**




**కీసర,(ప్రజావినికిడి):**
కీసర సర్కిల్ పరిధిలో బండ్లగూడ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం జోరుగా సాగుతుంది, సంబంధిత అధికారుల మౌనం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. బండ్లగూడ సమీపంలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నప్పటికీ,టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నదానిపై స్పష్టత లేకపోయినా పనులు నిరాటంకంగా కొనసాగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు,ఇంత భారీ నిర్మాణాన్ని చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఈ నిర్మాణం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. రాజకీయ పలుకుబడితో నిబంధనలను పక్కనబెట్టి నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నజరానాలు అందడం తోనే అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉన్నతాధికారులు తరచూ ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పటికీ నిర్మాణాన్ని గుర్తించలేదా? లేక ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.గతంలో కూడా కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై పలు ఆరోపణలు వచ్చినా,కఠిన చర్యలు లేకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై సందేహాలు పెంచుతోంది.

ఇప్పటికైనా సంబంధిత డిప్యూటీ కమిషనర్,టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు అంశాలపై పూర్తి వివరాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ నిర్మాణం అక్రమమని తేలితే వెంటనే పనులను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన కేశంపేట మండల కాంగ్రెస్ నాయకులు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘన సన్మానం**

**కేశంపేట మండల అభివృద్ధి అంశాలపై మంత్రికి వినతి ప్రజా సంక్షేమం**

**అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి వాకిటి శ్రీహరి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు అలాగే యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేస్తున్న తీరును అభినందించారు. అలాగే కేశంపేట మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు.అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, కేశంపేట మండలంలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్,మండల కాంగ్రెస్ నాయకులు,ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూప్లా నాయక్, బోధన్‌పల్లి సర్పంచ్ నగేష్, నిర్ధవెల్లి డిప్యూటీ సర్పంచ్ సాపురా అమీర్,మల్లేష్, నర్సింహా, యాదగిరి, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# రూ.21 కోట్లతో కంసాన్‌పల్లి పశు ఘనీకృత వీర్య నాలికల ఉత్పత్తి కేంద్రం

**త్వరలో పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తాం**

**రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో రెండో కేంద్రంగా కంసాన్‌పల్లి**

**ఏడాదికి 10 లక్షల మేలు జాతి పశువుల ఉత్పత్తికి కేంద్రం దోహదం**

**పాల ఉత్పత్తిలో తెలంగాణను ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో కేంద్రాన్ని త్వరలోనే వాడుకలోకి తీసుకురానున్న ప్రభుత్వం**
















**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాని పశువుల ఘనీకృత వీర్య నాలికల (ఫ్రోజన్ సీమెన్ స్ట్రా) ఉత్పత్తి కేంద్రాన్ని రూ.21 కోట్లతో పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు అలాగే యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

ఆదివారం స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తో కలిసి మంత్రి పశు వీర్య గణాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు కేంద్రం నిర్మాణం, అందుబాటులో ఉన్న సదుపాయాలు, లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణను మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి స్థానిక మీడియాతో మాట్లాడుతూ, కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి పశు ఘనీకృత వీర్య నాలికల ఉత్పత్తి కేంద్రం కంసాన్‌పల్లిలోనే ఉందని తెలిపారు. ఈ కేంద్రం పూర్తి స్థాయిలో ప్రారంభమైతే మేలు జాతి పశువుల ఉత్పత్తి గణనీయంగా పెరిగి,రైతులకు అధిక పాల ఉత్పత్తి చేసే పశువులు అందుబాటులోకి వస్తాయని అన్నారు.ఇప్పటికే నిర్మాణం పూర్తయినా ఉపయోగంలోకి రాని ఈ కేంద్రాన్ని రూ.21 కోట్లతో అన్ని హంగులతో సన్నద్ధం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అవసరమైన సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పన,సాంకేతిక ఏర్పాట్లపై అధికారులు నివేదికలు సమర్పించిన వెంటనే కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. మాంసం,పాల విక్రయాల్లో తెలంగాణ మంచి పురోగతి సాధిస్తున్నప్పటికీ, పాల ఉత్పత్తిలో మాత్రం ఇంకా వెనుకబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో పాల ఉత్పత్తిలో తెలంగాణ 13వ స్థానంలో ఉందని, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కంసాన్‌పల్లి కేంద్రం అందులో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

### రూ.21 కోట్లతో కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రూ.21 కోట్లతో ఈ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అవసరమైన నిధులు, సిబ్బంది నియామకం, ఇతర ఏర్పాట్లపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించిన వెంటనే పనులు పూర్తి చేసి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ఈ కేంద్రం ద్వారా ఏడాదికి సుమారు 10 లక్షల మేలు జాతి పశువుల ఉత్పత్తికి అవసరమైన ఘనీభవించిన వీర్య నాలికలు తయారు చేసే సామర్థ్యం ఏర్పడుతుందని, దీంతో రైతులకు అధిక పాల ఉత్పత్తి చేసే మేలు జాతి పశువులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్బారాయుడు, పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వహణాధికారి, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ సింగం చరణ్ కౌశిక్ యాదవ్,పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జ్ఞానప్రకాశ్, కంసాన్‌పల్లి సర్పంచ్ గీత, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశువైద్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రవణ్ కుమార్,ఈవో డాక్టర్ అరుణశ్రీ, స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎన్.ఆర్. సరిత,ఎమ్మార్వో నాగయ్య, స్థానిక నాయకుడు నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి,మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ఇద్రీస్,స్థానిక పశు వైద్యులు, గోపాలమిత్ర సూపర్వైజర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

**రాష్ట్ర పుష్ప మర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రానికి 60 ఏళ్ల స్వర్ణోత్సవం..**

**1966లో ప్రారంభమైన షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా**

**పెండింగ్‌లో ఉన్న పాడి రైతుల బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తాం**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**వేలాది మంది పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కేంద్రం దోహదం**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ పట్టణంలోని షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

అలాగే తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (టీజీఎల్ డి ఏ) చైర్మన్ చరణ్ కౌశిక్, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు కేంద్రం చరిత్రను వివరించారు. 1966లో స్థాపించబడిన షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం గత ఆరు దశాబ్దాలుగా వేలాది మంది పాల ఉత్పత్తిదారుల నుంచి పాలను సేకరించి పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకంగా సేవలందిస్తోందని తెలిపారు.

పాడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..మంత్రి వాకిటి శ్రీహరిమంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, పాడి పరిశ్రమ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమని అన్నారు.పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం అందిస్తామని తెలిపారు.

### పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లించేలా కృషి చేస్తాం:ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషకర విషయమని అన్నారు.ఈ కేంద్రం ద్వారా వేలాది మంది రైతులు తమ పాలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందారని పేర్కొన్నారు.పాడి రైతులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వీలైనంత త్వరగా విడుదల చేయించేలా మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పాడి రైతుల సంక్షేమం,పాల ఉత్పత్తి పెంపు, సహకార పాల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (టిజిఎల్ డిఏ) చైర్మన్ చరణ్ కౌశిక్,తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి,పాడి రైతులు,పాల సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు రూ.325 కోట్లు..

**రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు అలాగే యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి**

**3,500 ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యే శంకర్ కృషి..**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి-మంత్రి వాకిటి శ్రీహరి**

**అన్నారం గ్రామంలో గిరిజన మహిళ నేనావత్ జ్యోతి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**

**2,780 ఇళ్లు వివిధ దశల్లో పూర్తి..**

**720 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?**

**లబ్ధిదారురాలిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**'పాత ఇంట్లో భయంగా ఉండేది.. ఇప్పుడు సొంత ఇంటితో ఎంతో ఆనందంగా ఉంది'.. లబ్ధిదారురాలు జ్యోతి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సుమారు రూ.325 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పెద్దఎత్తున కృషి చేసి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు,అలాగే యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో గిరిజన మహిళ నేనావత్ జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని మంత్రి వాకిట శ్రీహరి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్డీవో ఎన్.ఆర్. సరిత,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చప్లా నాయక్, డిప్యూటీ ఇంజనీర్ సురేష్,ఏఈ సాయినాథ్, ఎంపీడీవో శ్రీకాంత్, ఎమ్మార్వో నాగయ్య తదితర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

గృహప్రవేశం సందర్భంగా మంత్రి,ఎమ్మెల్యే, అధికారులు లబ్ధిదారురాలు నేనావత్ జ్యోతి కుటుంబ సభ్యులకు సంప్రదాయం ప్రకారం కొత్త బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దూరదృష్టితో పనిచేస్తున్నారని కొనియాడారు. ఒకే నియోజకవర్గానికి తొలి విడతలోనే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించి దాదాపు రూ.325 కోట్ల విలువైన పనులను చేపట్టించడం హర్షణీయమని అన్నారు. మంజూరైన 3,500 ఇళ్లలో ఇప్పటికే 2,780 ఇళ్లు వివిధ దశల్లో పూర్తవుతుండగా, మరో 720 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందని మంత్రి తెలిపారు. అన్ని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**'జ్యోతమ్మా... ప్రభుత్వాన్ని దీవించమ్మ'**

గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారురాలు జ్యోతి కుటుంబ సభ్యులకు బట్టలు అందజేసిన అనంతరం,మంత్రి సమక్షంలో ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. "మీకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుతోంది కదా... వెళ్తున్నావా?" అని ఎమ్మెల్యే ప్రశ్నించగా, జ్యోతి "అవును" అని సమాధానం ఇచ్చారు.అలాగే సన్నబియ్యం, రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, కళ్యాణలక్ష్మి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందితే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సూచించారు.

**'శంకర్ అన్న వల్లే నాకు కొత్త ఇల్లు వచ్చింది'**

ఈ సందర్భంగా లబ్ధిదారురాలు నేనావత్ జ్యోతి మాట్లాడుతూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే తాను ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోగలిగానని తెలిపారు. గతంలో పాత ఇంట్లో ఉండేందుకు భయపడేదాన్నని, ఇప్పుడు కొత్త ఇంట్లో కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్నానని చెప్పారు. తనకు ఇల్లు కల్పించిన మంత్రి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

**బాలు నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు**

అన్నారం గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలు నాయక్ ను మంత్రి వాకిడి శ్రీహరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నారం గ్రామానికి వచ్చిన సందర్భంగా బాలు నాయక్ జన్మదినని తెలుసుకొని ఆయనకు ప్రత్యేకంగా శాలువాకప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్,ఆర్డీవో ఎన్.ఆర్.సరిత, ఎమ్మార్వో నాగయ్య, ఎంపీడీవో







శ్రీకాంత్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చప్లా నాయక్, డిప్యూటీ ఇంజనీర్ సురేష్,ఏఈ సాయినాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ఇద్రీస్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, శేఖర్ రెడ్డి,కుమార్ గౌడ్,శేఖర్, కృష్ణారెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, తుపాకుల శేఖర్, చందులాల్,శ్రీను నాయక్,చందు నాయక్, మురళీమోహన్, అప్పి,ముబారక్ అలీ ఖాన్,నరేష్, కొప్పుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన ఖాదర్ గోరి బ్రదర్స్

**అమరచింత దర్గా ఉరుసులో ఏళ్లుగా అన్నదానం చేస్తున్న ఖాదర్ గోరి సేవలను అభినందించిన మంత్రి..**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు అలాగే యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఖాదర్ గోరి బ్రదర్స్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఖాదర్ గోరితో పాటు హైదర్ గోరి, కొత్తపేట ఉస్మాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వాకిట శ్రీహరి మాట్లాడుతూ, అమరచింతలో జరిగే హజ్రత్ రాజావలి దర్గా ఉరుసు సందర్భంగా ఖాదర్ గోరి ఎన్నో సంవత్సరాలుగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి సంవత్సరం దూరం నుంచి వచ్చి భక్తులకు సేవ చేయడం సామాజిక సేవకు నిదర్శనమని అన్నారు.

ఖాదర్ గోరి మాట్లాడుతూ, అమరచింత దర్గా అభివృద్ధి,ఉరుసు నిర్వహణ విషయంలో మంత్రి వాకిటి శ్రీహరి ఎప్పటికప్పుడు సహకరిస్తూ వస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా మంత్రి ఆశీస్సులు, సహాయ సహకారాలు తమకు అందించాలని కోరారు.ఈ సమావేశానికి అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్కు ఖాదర్ గోరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన ముహమ్మద్ ఇబ్రహీం



**షాద్‌నగర్, (ప్రజావినికిడి):** షాద్‌నగర్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు అదేవిదంగా యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ముహమ్మద్ ఇబ్రహీం మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఓటు హక్కు ప్రతి పౌరుడు హక్కు:చైతన్యపురి బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్





**చైతన్యపురి, జులై,5 (ప్రజావినికిడి):**చైతన్యపురి డివిజన్లో "సర్ " ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం లో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్, మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనది ప్రతి అర్హుడు ఓటర్ జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దీూా కృష్ణ వేణి, డివిజన్ బిఆర్ఎస్ బిఎల్ఏ గణేష్, బూత్ నంబర్ 41,42మరియు బూత్ నంబర్. 30 31 బి ఎల్ ఎ శ్రీశైలం యాదవ్, దీూా కొండల్ రెడ్డి బూత్ నంబర్ 34. BLO శ్రీ రాములు బిఎల్ఏ బాలు. బూత్ నంబర్. 27,28,29, బిఎల్ఏ రమేశ్,శ్రీకాంత్,మల్లేశ్ దీూా స్వప్న కలిసి మారుతి నగర్ ఫణిగిరి కాలనీలో ఇంటింటి ఓటర్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్..

## 3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!

**తెలంగాణలో భారీ పెన్షన్ల కుంభకోణం గుర్తింపు**

**లక్ష మంది అనర్హులు, మృతుల పేర్లతో డబ్బు డ్రా చేస్తున్నట్లు వెల్లడి**

**అనర్హులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం**

**రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3 లక్షల మందికి పెన్షన్ల మంజూరుకు నిర్ణయం**

**ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట**



తెలంగాణలో అర్హులైన నిరుపేదలకు అండగా ఉండాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ఏళ్లుగా జరుగుతున్న భారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సంక్షేమ ఫలాలు దుర్వినియోగం కాకుండా చూడాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగుచూశాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్లు పొందుతున్నట్లు అధికారికంగా నిర్ధారించారు. మరింత దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్నేళ్ల క్రితం మరణించిన లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా, వారి స్థానంలో కొందరు అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి నెలనెలా డబ్బులు డ్రా చేస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

ఈ భారీ అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఆయుధంగా ప్రయోగించింది. లబ్ధిదారులు జీవించి ఉన్నారో లేదో నిర్ధారించే 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి చేయడంతో దొంగ పెన్షన్ల దందా బట్టబయలైంది. ఈ డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా వెల్లడైంది. దీంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు, గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్షాళనతో ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెలా వృథాగా పోతున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుంది.

అయితే, అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకే అందించాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులకు పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుండగా, దానికి అదనంగా తాజాగా గుర్తించిన లక్ష మంది అనర్హుల స్థానంలో మరో లక్ష మంది కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 3 లక్షల మంది నిరుపేదలకు కొత్తగా ఆర్థిక భద్రత లభించనుంది. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం.

ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ప్రస్తుతం గ్రామ, వార్డు స్థాయిల్లో అర్హులను గుర్తించే సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హుల వడపోత ప్రక్రియ తుది దశకు చేరుకుందని, త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి, కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సచివాలయ ఉన్నత వర్గాలు వెల్లడించాయి.

# విజయవాడ - హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం.. చిన్నారితో సహా నలుగురు మృతి



నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడితో సహా నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటన చిట్యాల మండల పరిధిలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది.ప్రమాదంలో మృతి చెందిన వారంతా తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా గుర్తించారు. వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్‌ను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.